క్లుప్తంగా

ప్రాణరక్షణకు హెల్మెట్ వినియోగించాలి



వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

తాడేపల్లిగూడెం రూరల్: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను రక్షించుకోవడానికి హెల్మెట్ వినియోగించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎ.వీ.సుబ్బరాజు అన్నారు. శనివారం రాత్రి తాడేపల్లిగూడెం పట్టణ శివారు ఏపీ నిట్ సమీపంలో హెల్మెట్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇటువంటి మరణాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్లే సంభవించాయని గుర్తు చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎస్వీవీఎస్. మూర్తి, ఎస్సై వీఎస్.వీరభద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితవాడలను అధికారులు దత్తత తీసుకోవాలి

భీమవరం అర్బన్: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళితవాడలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, దళితవాడలను అధికారులు దత్తత తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. జొన్నలగరువులో శనివారం నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల వల్ల లబ్ధి పొంది అత్యున్నత స్థానంలో దళిత ఉద్యోగులు ఈ దత్తత చేపట్టాలని కోరారు. అనంతరం సంఘ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కొయ్యే సంపతరావు, మండల కార్యదర్శిగా నల్లి వెంకట స్వామి, అధ్యక్షులుగా మద్దా రాజారత్నం మరి కొంతమంది సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. బీర వెంకటరత్నం, విప్పర్తి వినయ్, బొడ్డుపల్లి యాకోబు, చెల్లి రాజ్ కుమార్, పిట్టా వినోద్, దాసరి చిరంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

భీమవరం అర్బన్: భీమవరం రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ సాయి దుర్గాప్రసాద్ అన్నారు. వెంప జెడ్పీ హైస్కూల్లో రొటేరియన్ గొట్టుముక్కల రంగరాజు, భీమవరం రోటరీ క్లబ్ సహకారంతో 9, 10 తరగతి విద్యార్థినులకు శనివారం రూ.3 లక్షల విలువైన 42 సైకిళ్లను పంపిణీ చేశారు. సాయి దుర్గాప్రసాద్, భీమవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు గుదు కిషోర్ మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యనభ్యసిస్తేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందన్నారు. క్లబ్ డైరెక్టర్ షేక్ బాబాజీ సాహెబ్, హెచ్ఎం నడింపల్లి సూర్య భగవాన్‌రాజు, కె.అప్పలరాజు, క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్వీఆర్‌సీ జయవర్మ, గుండు గిరి, ఎస్ఎంసీ చైర్మన్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ప్లేస్‌మెంట్స్ డే

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఢిల్లీ ఐఐటీ డీన్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు ఉద్యోగంలో చేరిన తరువాత ఆయా కంపెనీల అవసరాలకు అనుగుణం స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం అపారమైన ఉద్యోగావకాశాలున్నందున అకాడమిక్స్‌తోపాటు ఆధునిక అంశాలపై కూడా పట్టు సాధించాలన్నారు. మరొక అతిథి టీసీఎస్ రీజనల్ హెచ్ఆర్ పర్వేన్ అహ్మద్ మాట్లాడుతూ డిజిటల్ రంగంలో అపారమైన అవకాశాలున్నాయని, ప్రధానంగా కోడింగ్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాలలోని సుమారు 1,000 మంది టీసీఎస్, కాగ్నిజెంట్, ఐబీఎమ్, టాటా పవర్, జిందాల్ స్టీల్ వర్క్స్ వంటి వివిధ కంపెనీల్లో పెద్దమొత్తం వేతనాలకు ఉద్యోగాలు దక్కించుకున్నారన్నారు. అనంతరం క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కళాశాల డీన్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ డాక్టర్ కేఆర్ సత్యనారాయణ, గవర్నింగ్‌బాడీ సభ్యుడు ప్రతీక్‌వర్మ, వివిధ కంపెనీల ప్రతినిధులు ప్రసాద్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

నరసాపురం: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 18వతేదీ శనివారం నరసాపురం కోర్టు వద్ద ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. కుటుంబ తగాదా కేసులు, వినియోగదారుల హక్కుల కేసులు, మేధోసంపత్తి హక్కుల కేసులు రాజీ చేస్తామని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

19న రాష్ట్రస్థాయి యోగా పోటీలు

నరసాపురం: నరసాపురం అల్లూరి సత్యనారాయణరాజు కల్యాణ మండపంలో ఈనెల 19న రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ చంద్రశేఖర్ చెప్పారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు



మౌంజీపాడు గ్రామంలో విద్యుత్ స్తంభాలు పాతుతున్న దృశ్యం



రామచంద్రపురం, విప్పర్రు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు

పెంటపాడు: నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో విద్యుత్ ఏర్పాట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. వందలాది విద్యుత్ స్తంభాలు పాతారు. ప్రతి ఇంటికీ మీటర్, ప్రతి వీధిలో కరెంట్ లైన్, ప్రతి కాలనీకి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా 27 కిలోమీటర్ల దూరం ఉన్న కరెంట్ లైన్‌ను సిబ్బంది లాగుతున్నారు. ఇందుకోసం అధికారులు పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించారు. నిరుపేదలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం కేవలం ఒక్క పెంటపాడు మండలంలో సుమారు రూ. 6 కోట్ల రూపాయలు కేటాయించిన విషయం విధితమే. అన్ని లేఅవుట్‌ల్లో 1050 స్తంభాలు పాతారు. 21 గ్రామాల్లో 27 లేఅవుట్‌లకు గాను ఇప్పటివరకు 21 లేఅవుట్‌ల్లో 34 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. జువ్వలపాలెంలో ప్రధాన సబ్ స్టేషన్‌గా ఉంది. దీనికి అనుసంధానంగా ముదునూరుపాడు, కాశిపాడు సబ్ స్టేషన్‌ల ద్వారా విద్యుత్ అందుతోంది. నూతనంగా కె. పెంటపాడులో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్రంగా కృషి చేస్తున్నారు. కాలనీలో నివసించే పేదలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సబ్ స్టేషన్లు ఏర్పాటు పనులు సైతం కొనసాగుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం, ప్రతి ఇంటికి మీటర్ ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు, కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని లేఅవుట్‌ల్లో విద్యుత్ సౌకర్యం



మండలంలోని అన్ని గ్రామాల్లో లేఅవుట్‌లలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సౌకర్యం అందించేందుకు రాత్రి, పగలు సిబ్బందితో శ్రమిస్తున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే లబ్ధిదారులు సమాచారం అందించవచ్చు. నిరంతరం అందుబాటులో ఉంటాం.

– కె పద్మరాజు, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్

ఇబ్బందులు తీరాయి



ఇల్లు నిర్మించుకొనే సమయంలో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం. నేడు ఇళ్లు పూర్తయ్యింది. సకాలంలో జగనన్న దయ వల్ల విద్యుత్ కూడా అందిచండంతో ఇబ్బందులు తీరాయి –చల్లా విజయలక్ష్మి, రామచంద్రపురం, జగనన్న కాలనీ

జగనన్నకు రుణపడి ఉంటాం



సొంత ఇళ్లు రావడం సంతోషంగా ఉంది. దీంతో పాటు, విద్యుత్ సమస్యలు పడకుండా ప్రతి ఇంటికి మీటర్ అందించారు. విద్యుత్ లైన్‌కూడా వేయడంతో సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు

– అడపా వీరవెంకట కృష్ణకుమారి, వెస్ట్ విప్పర్రు

కడియం నర్సరీలను సందర్శించిన బంగ్లాదేశీయులు



నర్సరీని సందర్శించిన దృశ్యాలు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్శిటీలో ఫ్లవర్ టెక్నాలజీపై జరుగుతున్న అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన బంగ్లాదేశీయులు శనివారం కడియం నర్సరీలను సందర్శించారు. షేర ఎ బంగ్లా వ్యవసాయ విశ్వ విద్యాలయం, సొసైటీ ఫర్ బ్రైట్ సర్వీసెస్‌లు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఉద్యాన యూనివర్శిటీ వీసీ టి.జానికిరామన్ పర్యవేక్షణలో కడియం సత్యదేవ నర్సరీని సందర్శించి పలు విషయాలు తెలుసుకున్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రుల శ్రద్ధ



పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్‌స్కూల్లో మాట్లాడుతున్న హెచ్ఎం ప్రసాద్ తదితరులు

పెంటపాడు: విద్యలో వెనకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా బోధన చేయనున్నట్లు పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్‌స్కూలు హెచ్ఎం ఎవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక స్కూల్ వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లి దండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ కమిటీ చైర్మన్ వైస్ కళింగ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, పీడీ రాజేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పరిమెళ్ల జెడ్పీ స్కూల్లో పేరెంట్ కమిటీ సమావేశం హెచ్ఎం అధ్యక్షతన శనివారం నిర్వహించారు.

హెచ్3ఎన్2 వైరస్ పై జాగ్రత్తలు తీసుకోండి

తాడేపల్లిగూడెం (టీటీసీ): హెచ్3ఎన్2 వైరస్ ప్రస్తుతం ఇండియాలో వేగంగా విస్తరిస్తుందని, ఆందోళన చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు వెల్లడించారు. హెచ్3ఎన్2 వైరస్ వచ్చిన వారికి మూడు నుంచి ఐదు రోజుల పాటు గొంతునొప్పి, జ్వరం ఉంటుందని తెలిపారు. మూడు వారాలు దగ్గు, కొద్ది మందిలో ఆయాసం, చలి, వాంతులు, ముక్కుకారడం, తుమ్ములు ఉంటాయని వెల్లడించారు. వైరస్ రాకుండా ఉండేందుకు గాను తరుచుగా చేతులు కడుకోవడం, మాస్క్ ధరించడం, గుంపులకు దూరంగా ఉండటం, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేయి అడ్డం పెట్టుకోవాలని, ఎక్కువ నీరు తాగాలి, జ్వరం, ఒళ్లు నొప్పులు ఉంటే పారాసెటమల్ ట్యాబ్లెట్లు వేసుకోవాలన్నారు. షేక్ హ్యాండ్ ఇవ్వకూడదని, పబ్లిక్‌లో ఉమ్మివేయరాదని, డాక్టర్లును సంప్రదించి వారి సూచనలను అనుసరించాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఏవుళ్లమ్మ తల్లి జాతర ప్రారంభం



తణుకు శివాలయం వీధిలో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాల వెలుగులు

తణుకు అర్బన్: పట్టణంలోని సజ్జాపుర వాసుల ఇలవేలుపు శ్రీఏవుళ్లమ్మ తల్లి జాతర మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జాతర మహోత్సవాలతో సజ్జాపురంలో సందడి నెలకొంది. జాతర మహోత్సవంలో భాగంగా గతనెల 21వ తేదీన అమ్మవారిని నడివీధిలోకి తీసుకువచ్చి పూరిగుడిసెలో ఉంచారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి కొమ్మిరెడ్డి వారు పుట్టినింటిగా మాకినీటి వారు మెట్టినింటిగా పూజాధికాలు జరిపిస్తారు. పుట్టినింటికి వచ్చిన అమ్మవారికి పూరిగుడిసెలో ప్రత్యేక పూజాధికాలు నిర్వహించిన అనంతరం ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జాతర మహోత్సవాలు అనంతరం తిరిగి మెట్టినింటికి సాగనంపే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

మూడేళ్లకోసారి... మూడేళ్లకోసారి నిర్వహించే ఈ జాతర మహోత్సవానికి దూరప్రాంతాల నుంచి సైతం తణుకు వాసులతోపాటు స్నేహితులు, బంధువులు వచ్చి సందడి చేస్తారు. అమ్మవారు పుట్టినింటికి వచ్చిన తరువాత ఇంటి ఆడపడుచులు జాతర పూర్తయ్యే వరకు తిరిగి మెట్టినింటికి వెళ్లకుండా సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. 12వ తేదీ రాత్రి జాతర మహోత్సవంలో భాగంగా బాణాసంచా కాల్పులు, తీన్‌మార్ డప్పులు, శక్తివేషధారణలు, బ్యాండు మేళాలతో సజ్జాపురం వీధుల్లో ఊరేగింపు సాగనుంది. ఇందులో భాగంగా ఆలయ ప్రాంతంతోపాటు సజ్జాపుర ప్రధాన వీధుల్లో విద్యుత్ దీపాల వెలుగులు కనువిందు చేస్తున్నాయి.

కవి ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం



విశాఖలో పురస్కారం అందుకుంటున్న ప్రసాద్

తణుకు: విశాఖపట్టణానికి చెందిన పల్లంటి ఆదిలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు ఆయన రచించిన అరిష్టాలకు మూలాలు అనే కవితకు జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించింది. శుక్రవారం చినవాల్తేరులో జరిగిన సభలో సభాధ్యక్షుడు పల్లంటి వెంకటరామకుమారరావు, వక్తలు కె.రఘువీర, ఎ.అప్పారావు, కె.మల్లిక్ తదితరుల చేతుల మీదుగా ప్రసంశాపత్రం, జ్ఞాపిక, నగదు బహుమతిని అందుకున్నారు.

పాస్‌పోర్టు పోయినది

వత్తి వత్స శ్రీలక్ష్మి, D/o వత్తి వేళ్ళవాళి, ... తణుకు. నా పాస్‌పోర్టు నెం. P7892157. తేది.09.03.2023 న తణుకులోని ... పోయినది. ... సెల్ నెం.94419 63397 కు తెలియజేయగలరు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ చేస్తున్న ఉద్యమంలో ప్రతి మాదిగ బిడ్డ భాగస్వామి కావాలని పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. పట్టణంలో శనివారం స్థానిక కడకట్లలోని బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ ఆందోళన కార్యక్రమాల కరపత్రాలను సంఘం నాయకులు విడుదల చేశారు. ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లా కో-కన్వీనర్ పసుపులేటి చిన్నబాబు మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేంద్రం అమోదం తెలిపేందుకు ఒత్తిడి చేసే క్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీన మాదిగ ఉద్యోగస్తులతోను, 28వ తేదీన మహాజన సోసిలిస్ట్ పార్టీ నాయకత్వంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీన మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో వేలాది మంది మాదిగలతో విజయవాడ, హైదరాబాద్ నగరాలలోని బీజేపీ కార్యాలయాలు ముట్టడి, 4వ తేదీన విజయవాడ, హైదరాబాద్ నగరాలను దిగ్బంధనం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లిపో రత్నాజీ, ఉండ్రాజవరపు ప్రభాకరరావు, శీలి వెంకటాచలం, వెంకటేశ్వర్లు, గాలింకి ప్రేమాకుమార్, బాదంపూడి సురేష్, విజయకుమార్, సంపత్, చెప్పులు వాసు తదితరులు పాల్గొన్నారు.

చినతాడేపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్



చినతాడేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్న గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీహర్ష, 104 సేవల డాక్టర్ పవన్ వర్మ 172మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 10మంది చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదిన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఒకటి నుంచి 19 ఏళ్ల బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో టివి.సత్యనారాయణ, క్లస్టర్ ఎంపీహెచ్ఏ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

15 నుంచి అగ్రిగోల్డ్ బాధితుల నిరసనలు

తణుకు టౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 15,16,17 తేదీల్లో నిర్వహించే నిరసన దీక్షలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల బీమారావు చెప్పారు. శనివారం తణుకులోని వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16, 17 తేదీల్లో నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్‌లు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వై నాగలక్ష్మీ, తణుకు బ్రాంచి అధ్యక్షుడు నల్లాకుల గణపతి, కార్యదర్శి నూనె శ్రీనివాస్, గుత్తుల కొండయ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ సిపిఐ కార్యదర్శి బొద్దాని గణపతి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై దృష్టి పెట్టాలి



పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం

తాడేపల్లిగూడెం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై దృష్టి పెట్టాలని పాఠశాల తల్లిదండ్రుల కమిటి చైర్మన్ బొల్లం వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్ లాల్ బీబీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్ని టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. విద్యపై దృష్టి పెట్టేలా తమ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. విద్యార్థుల ఉత్తీర్ణతలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు కేవీవీ.రామాంజనేయులు, జి.హరిప్రసాద్, కె.రాజలత, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండిలో ఎన్నికల చెక్‌పోస్టు

ఉండి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉండి సెంటర్‌లో పోలీసులు చెక్‌పోస్టును శనివారం ఏర్పాటు చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. మద్యం, నగదు వంటివి తరలించకుండా ఉండి, ఏలూరుపాడు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఆకివీడు రూరల్ సీఐ గీతాకృష్ణ చెప్పారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎక్కడా ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

తణుకు టౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలని గృహ నిర్మాణశాఖ మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం తణుకు రూరల్ మహాలక్ష్మీ చెరువు గ్రామస్థులకు కేటాయించిన లేవుట్‌ల్లో నూతన గృహాలకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండపాక లేవుట్‌లో మండలంలో గృహ నిర్మాణాలపై అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌ల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే వరకూ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ లేవుట్‌ల్లో జరిగిన గృహ నిర్మాణ శంకుస్థాపనల్లో ఆయా లబ్ధిదారుల కుటుంబాలతో పాటు అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో టీఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

కాళ్ల: సీసలి గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గ్రామ పెద్దలు గణేశ్న బంగారయ్య చెప్పారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ సుమారు 250 ఏళ్ల క్రితం పోలేరమ్మ అమ్మవారు గ్రామంలో వెలిశారన్నారు. అమ్మవారు వెలిసిన ప్రాంతంలో గద్దె ఉండేదని, అది క్రమేపీ శిథిలావస్థకు చేరుకోవడంతో దీని అభివృద్ధికి మూడు కుటుంబీకుల వారు ముందుకు వచ్చారన్నారు. వీరిలో కొంతమంది విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావడం శుభపరిణామన్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, భీమవరం: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కిలోల గంజాయిని సీఐ బి.కృష్ణకుమార్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు శనివారం చెప్పారు. బైపాస్ రోడ్డు కూడలిలో దుర్గాపురానికి చెందిన కె.సాయి, పశ్చిమబెంగాల్‌కు చెందిన సత్యామండాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు.

అగ్నికుల క్షత్రియ సమావేశం విజయవంతం చేయాలి

భీమవరం అర్బన్: విజయవాడలోని ప్రెస్ క్లబ్ భవనంలో సోమవారం జరిగే అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ జాతీయ కార్యవర్గ సమావేశానికి అగ్నికుల క్షత్రియులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘ జాతీయ అధికార ప్రతినిధి కేఆర్‌కే వర్మ కోరారు. కొత్తపూసలమర్రులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినిధులు హాజరై సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలు, చర్చిస్తారన్నారు.

అన్నసమారాధనకు విరాళం

కాళ్ల: కాళ్లకూరులోని స్వయంభూః శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానం అన్నసమారాధనకు గ్రామానికి చెందిన దాతలు పొదిలాపు నాగేశ్వరరావు కుమారుడు పాపారావు మధుసాయి, నాగలక్ష్మి దంపతులు రూ.50 వేల విరాళాన్ని శనివారం అందించారు. దేవస్థానం చైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, ఈఓ చాగంటి సురేష్ నాయుడు దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి వస్త్రంతో సత్కరించారు.

మద్యం షాపులు మూసివేత

ఆకివీడు: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మద్యం విక్రయాలు జరుగకుండా షాపులకు శనివారం సాయంత్రం నాలుగు గంటలకు సీలు వేసినట్లు ఎక్సైజ్ సీఐ రామారావు చెప్పారు. ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల్లోని 27 షాపులను ఈ సందర్భంగా మూసివేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం అమ్మినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు షాపులు తెరుస్తామన్నారు.